



### రెగ్యులర్ పీవోను నియమించాలి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మన్ననూరులో ఏర్పాటు చేసిన ఐటీడీఏకు ఐఏఎస్ అధికారిని పీవోగా నియమించలేదు. రెగ్యులర్ పీవో ఉంటేనే చెంచులకు న్యాయం జరుగుతుంది. కార్యాలయ భవనాన్ని నిర్మించాలి. పాలక మండలిని ఏర్పాటు చేసి, సమావేశాలు జరపాలి.

- దాసరి శ్రీనివాసులు, మన్ననూరు ఎంపీటీసీ సభ్యుడు

### సమస్యలు వినేవారేరీ?

మన్ననూరులో ఐటీడీఏలో సమస్యలు చెబుతామంటే ఇన్‌చార్జి అధికారులు కలిసే పరిస్థితి లేదు. పెంటల్లో ఐటీడీఏ అధికారులు పర్యటించాలి. అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

- బాల గురువయ్య, అప్పాపూర్ పెంట, మాజీ సర్పంచి

## ఉపాధి హామీ ఉద్యోగులకు..
# జీతాల్లేవ్

- మూడు నెలలుగా అందని డబ్బులు
- ఖజానాలో సొమ్మంతా ఊడ్చేసిన గత ప్రభుత్వం
- కూలీల సంఖ్యను పెంచితేనే నిధులు వచ్చే అవకాశం
- మల్లగుల్లాలు పడుతున్నా పెరగని సంఖ్య
- ప్రతీ ఊరి నుంచి 50 మందికి తక్కువ కాకుండా చూడాలని ఆదేశాలు



నవాబ్‌పేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. రోజు వారీగా కూలీలను పనికి తెస్తూ, వారికి పేమెంట్‌లు వచ్చేలా చేస్తున్న ఆ ఉద్యోగులు తమ జీతాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. గత ప్రభుత్వం ఏడాదికి సరిపోయే బడ్జెట్‌ను తొమ్మిది నెలలకే ఊడ్చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఉపాధి హామీ పథకంలో ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌ను ముందుగానే రూపొందిస్తారు. ఇందులో లేబర్ పేమెంట్‌కు అనుగుణంగా జిల్లాలో పని చేస్తున్న ఏపీవో, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఫీల్డ్ అసిస్టెంట్‌ల జీతాలకు బడ్జెట్ కేటాయిస్తారు. లేబర్ బడ్జెట్‌లో ఆరు శాతం అడ్మినిస్ట్రేషన్ ఎక్స్‌పెండీచర్‌గా నిర్ణయిస్తారు. ఈ ఆరు శాతంలోనే ఏడాదికి జీతాలు చెల్లించేలా ముందుగానే యాక్షన్ ప్లాన్ ఉంటుంది. జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద రూ.54.65 కోట్లు కూలీలకు, రూ.44.76 కోట్లు మెటీరియల్ కోసం ఖర్చు చేయగా, డిసెంబర్ నాటికి రూ.5.77 కోట్లు అడ్మినిస్ట్రేటివ్ ఖర్చులకు వినియోగించారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

### నిధుల మళ్లింపు..

### ముందుగానే ఖర్చు

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి ఖర్చు చేయాల్సిన నిధులను ఇతర పథకాలకు మళ్లించడం, ఉన్న బడ్జెట్‌ను ముందుగానే ఊడ్చేయడంతో ఖజానా ఖాళీ అయ్యింది. డిసెంబర్ నాటికే ఆరు శాతం అడ్మినిస్ట్రేషన్ ఖర్చుల డబ్బులను వాడుకోవటంతో జీతాలకు డబ్బులు లేకుండా పోయాయి. ఇప్పుడు జీతాలకు నిధులు జమ కావాలంటే... కూలీల సంఖ్యను పెంచాలి. వారికి ఎక్కువ పనిదినాలు కల్పిస్తే దాంట్లో ఆరు శాతం అడ్మినిస్ట్రేషన్ ఖర్చుకు జమవుతూ వస్తాయి.

### ప్రతీ గ్రామానికి 50 మంది టార్గెట్

కూలీల సంఖ్య పెంచితే ఉద్యోగులకు జీతాలు వస్తాయని భావించిన ఉన్నతాధికారులు ఉద్యోగులకు టార్గెట్‌లు విధించారు. ఉదాహరణకు లేబర్ పేమెంట్ రూ.కోటి ఖర్చు చేస్తే అందులోంచి ఆరు శాతం అంటే రూ.ఆరు లక్షలు అడ్మినిస్ట్రేషన్ ఎక్స్‌పెండిచర్‌లో జమ అవుతాయి. అందుకే ప్రతీ గ్రామానికి 50 మందికి తక్కువ కాకుండా పని చేయాలని ఉద్యోగులకు ఆదేశాలిచ్చారు. ప్రస్తుతం జిల్లాలో కేవలం 10,847 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఈ సంఖ్యను 25-30 వేలకు పెంచాల్సి ఉంది. ప్రస్తుతం ఎండలు పెరగడంతో కూలీలు పెరుగుతారో లేదోనన్న ప్రశ్న నెలకొంది. ఇప్పటికే 100 రోజులు వినియోగించుకున్న కుటుంబాలు పనికి వచ్చే అవకాశం లేనందున 60-70 రోజులు పని చేసిన కుటుంబాలను పనులకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అదే ఏప్రిల్‌లో అయితే కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుండటంతో 100 రోజులు పనిచేసి వాళ్లంతా మళ్లీ పనులకు వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే ఈ నెల రోజులు కూలీలు పనులకు వచ్చే అవకాశం అంతంతమాత్రంగానే ఉంది. దాంతో కూలీలను పనులకు తీసుకురావడానికి ఉద్యోగులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

### యాప్‌లో తికమకలు

ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఐసీ యాప్‌ను తెచ్చింది. దీని ప్రకారం రోజూ రెండుసార్లు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని చేసే ప్రాంతానికి వెళ్లి లేబర్ ఫొటోలు తీయాల్సి ఉంటుంది. ఆధార్‌తో లింక్‌అయిన ఫొటో ఉంటేనే యాప్ అనుమతిస్తుంది. పని చేసేవాళ్ల ఫేస్ అథెంటికేషన్ చేయాల్సి ఉంటుంది. ఒకరిబదులు మరొకరు పనికి వెళ్లడానికి వీలులేదు. ఉదయం వెళ్లి పని ప్రదేశంలో ఫొటో తీసినపుడు లోకేషన్ చూయిస్తుంది. మళ్లీ సాయంత్రం ఫొటో తీసే సమయంలో ఆ లోకేషన్ 10 మీటర్లలోపు ఉంటేనే యాప్‌లో క్యాప్చర్ అవుతుంది. ఎక్కడో ఉండి తీస్తామంటే కుదరదు. ప్రతీ కూలీ పేరిట ఈకేవైసీ చేయాల్సి ఉంటుంది. దీన్ని ఎన్‌పీసీ(నేషన్‌పేమెంట్ సిస్టమ్ మాడ్యూల్) చేస్తే నేరుగా లబ్ధిదారు అకౌంట్‌ల్లో డబ్బులు జమఅవుతాయి. ప్రతీ రోజు ఫీల్డ్ అసిస్టెంట్ కచ్చితంగా అన్ని పనిప్రదేశాలకు వెళ్లి ఫొటోలు తీయాల్సి ఉంటుంది. లేదంటే ఆ రోజు కూలీలకు కూలీ ఇచ్చే పరిస్థితి ఉండదు.

## మన్ననూరు ఐటీడీఏకు..
# మహర్దశ వచ్చేనా

- పదేళ్లుగా ఇన్‌చార్జి పీవోలతోనే కాలయాపన
- నిర్వహించని పాలక మండలి సమావేశాలు
- కుంటుపడుతున్న చెంచుల అభివృద్ధి



నల్లమలలోని ఓ చెంచు గుడిసె

మన్ననూర్, ఫిబ్రవరి 19: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి విడిపోయిన నాగర్ కర్నూలు జిల్లా పరిధిలోని అమ్రాబాద్ మండలం మన్ననూరు ఐటీడీఏ కార్యాలయం పదేళ్లుగా ఇన్‌చార్జి పీవోల పాలనతోనే నడుస్తోంది. తాజాగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భద్రాచలం ఐటీడీఏను సందర్శించి, అక్కడి పాలక మండలి సభ్యులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని ఐటీడీఏల పరిస్థితిని బాగు చేస్తామని ప్రకటించడంతో స్థానిక చెంచు గిరిజనులు మన్ననూరు ఐటీడీఏనూ పట్టించుకోవాలని కోరుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

### ఉమ్మడి రాష్ట్ర పాలనలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 10 జిల్లాల ఐటీడీఏ నంద్యాల జిల్లా సున్నిపెంటలో ఉండేది. అక్కడే పాలక మండలి సమావేశాలు జరిగేవి. జీవీవీకే(గిరిజన విద్యావికాస కేంద్రాలు)ల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ప్రతీ నెల పీవో సమావేశం నిర్వహించి, మారుమూల చెంచు పిల్లల విద్యాభ్యాసంపై ఆరా తీసేవారు. వ్యవసాయ శాఖకు ఏవో ఉండేవారు. చెంచు రైతులకు సబ్సిడీపై ఖరీఫ్‌లో విత్తనాలు పంపిణీ చేసేవారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కూడా ఉండేవారు. వారు సంచార వైద్యశాలలు, చెంచుల వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. నల్లమల పెంటల్లో పీవో వారంలో రెండు రోజులు క్షేత్ర పర్యటనలు చేసి, చెంచుల సమస్యలను తెలుసుకొనేవారు.

### తెలంగాణ ఏర్పడ్డాక ఇదీ పరిస్థితి..

తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో ఐటీడీఏను విభజించారు. తెలంగాణాలోని నాగర్‌కర్నూల్, నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వికారాబాద్, పరిగి జిల్లాలకు కలిపి మన్ననూరులోని అప్పటి మాడా కార్యాలయానికి పీవో కార్యాలయాన్ని తరలించారు. తెలంగాణా వాటాకు వచ్చే కార్యాలయం సామగ్రిని సైతం మన్ననూరుకు తెచ్చారు. కానీ అప్పటి నుంచి నేటి వరకు ఇన్‌చార్జీ పీవోల పాలననే కొనసాగిస్తున్నారు. రెండేళ్లు కలెక్టర్లు మన్ననూరులో చెంచుల అభివృద్ధిపై నెలకొకసారి అన్ని శాఖల అధికారులతో స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత గిరిజన దర్బార్ నిర్వహించారు. కానీ వాటిని కొనసాగించడం మానేశారు. 10 ఏళ్లుగా ఇతర శాఖల్లో పనిచేసే అధికారులు డాక్టర్ వెంకటయ్య, మంగ్యా నాయక్, అశోక్, డాక్టర్ నవీన్ నికోలస్, డిప్యూటీ కలెక్టర్ మనూ చౌదరి, ప్రస్తుత నాగర్ కర్నూల్ కలెక్టర్ ఉదయ్ కుమార్‌లు ఇన్‌చార్జి పీవోలుగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా అటవీ శాఖ డీఎఫ్‌వో రోహిత్ గోపిడి ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇన్‌చార్జీలుగా ఉన్న అధికారులు చెంచుల అభివృద్ధి కోసం నేరుగా పరిష్కారం చూపలేకపోతున్నారు. ప్రతీ పనికి రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు ఫైల్ పంపించాల్సి వస్తోంది. గతంలో రెగ్యులర్ పీవోలు ఉన్నప్పుడు చెంచులకు ఏదైన ఆపద వస్తే వారే తక్షణ చర్యలు తీసుకునేవారు.

### కార్యాలయంలో ఒకే ఉద్యోగి..

ప్రస్తుతం మన్ననూరు ఐటీడీఏలో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ జాఫర్ హుసేన్ మాత్రమే రెగ్యులర్ ఉద్యోగిగా ఉన్నారు. ఆయనే కార్యాలయ బాధ్యతలు చూస్తూ, చెంచుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఐటీడీఏలను బలోపేతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. తాజాగా ఆదివారం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క భద్రాచలం ఐటీడీఏలో అధికారులతో సమావేశం నిర్వహించి, ఐటీడీఏల ద్వారా చెంచులకు అభివృద్ధి ఫలాలు అందిస్తామని చెప్పారు. మన్ననూరు ఐటీడీఏలో నూ సమావేశాలు నిర్వహించి, కార్యాలయ సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని చెంచులు కోరుతున్నారు.



కాలినడకన నిత్యావసర సరుకులు తీసుకెళ్తున్న చెంచులు (ఫైల్)

## సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

- రేపు కోస్గికి రేవంత్‌రెడ్డి
- అధికారులతో నారాయణపేట కలెక్టర్ సమావేశం



కోస్గిలో సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట, ఫిబ్రవరి 19: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 21న కోస్గిలో పర్యటించనున్నట్లు నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు మయాంక్ మిత్తల్, అశోక్ కుమార్‌తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై కోస్గిలో అధికారులతో సమీక్షించారు. కోస్గి ప్రభుత్వ కళాశాల స్థలాన్ని పరిశీలించారు. పలు అభివృద్ధి పనులకు సీఎం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని, అందుకు శిలా ఫలకాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడ ఏర్పాటు చేయనున్న స్టాల్స్‌పై డీఆర్డీఏ అధికారులకు పలు సూచనలు చేశారు. మహిళా స్వశక్తి సంఘాలతో నిర్వహించే సమావేశానికి వేదికను ఏర్పాటు చేయాలని, లోటు పాట్లు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం సీఎం పర్యటనకు సంబంధించిన ప్రొటోకాల్‌పై తహసీల్‌లో జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రొటోకాల్ విషయంలో పొరపాట్లు లేకుండా శిలా ఫలకాలను ప్రాధాన్యత క్రమంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ కూడా ఏర్పాట్లను పరిశీలించారు.

### జిల్లా అధికారులతో సమీక్ష..

సీఎం పర్యటన సందర్భంగా కోస్గి మునిసిపల్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగంతో అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ సమీక్ష చేశారు. పర్యటన ఏర్పాట్లపై బాధ్యతలు అప్పగించిన అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. పర్యటన ముగిసే వరకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో రాంచందర్, జడ్పీ సీఈవో శైలజ, డిప్యూటీ సీఈవో జ్యోతి, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, అటవీ శాఖ అధికారి వీణవాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణమాచారి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## హరిత లక్ష్యంపై ప్రత్యేక దృష్టి

- 13 లక్షల 21 వెయ్యి మొక్కలు నాటేలా డీఆర్‌డీవో కార్యాచరణ
- సిద్ధమవుతున్న నర్సరీలు




పెద్దగూడెం గ్రామంలో నర్సరీలో పని చేస్తున్న ఉపాధి కూలీలు

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 19 : గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏటా వర్షాకాలంలో మొక్కలు నాటుతున్నారు. ఇందులో భాగంగా 2024-25కి సంబంధించిన హరితహారం లక్ష్యాన్ని ఆ శాఖ ఖరారు చేసి ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఈ ఏడాదికి గాను జిల్లా వ్యాప్తంగా 13 లక్షల 21వెయ్యి మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు అవసరమైన మొక్కలు సరఫరా చేసేందుకు వీలుగా గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ గ్రామంలో నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. విత్తనాలను నాటేందుకు వీలుగా బ్యాగులో మట్టిని నింపి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. జూన్, జులై నాటికి మొక్కలు అందజేసేలా పనులు చేపడుతున్నారు. ఈ ఏడాదికి గాను జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలలో 13లక్షల 21వేల మొక్కలు నాటాలని డీఆర్‌డీవో అధికారులు లక్ష్యంగా నిర్వహించారు. గత ఏడాది 13లక్షల 2వేలు మొక్కలు నాటారు. అయితే గత ఏడాదితో పోల్చితే హరితహారం లక్ష్యాన్ని పెంచారు. ఈ లెక్కన ఒక్క మండలానికి అమరచింత 72వేలు, ఆత్మకూరు 67వేలు, చిన్నంబావి 87వేలు, ఘనపూర్ 1,41వేలు, గోపాల్‌పేట 79,500, కొత్తకోట 1,13వేలు, మదనాపూర్ 87వేలు, పాన్‌గల్ 1,46,500, పెబ్బేరు 1,01,500, పెద్దమందడి 1,15వేలు, రేవల్లి 62,500, శ్రీరంగాపూర్ 41,500, వీపనగండ్ల 71,500, వనపర్తిలో ఒక లక్షా 36వేల హరితహారం మొక్కలకు ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని మండలాల్లో గతేడాది కంటే నాటాల్సిన మొక్కలను పెంచారు. నిర్దేశిత లక్ష్యాన్ని కనుగుణంగా రానున్న జూన్, జులై మాసాల్లో మొక్కలు నాటనున్నారు. జిల్లాలో నిర్ణీత లక్ష్యానికనుగుణంగా మొక్కలను సరఫరా చేసేందుకు ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో మొక్కల పెంపకానికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో నల్లమట్టిని తీసుకురావడంతో పాటు, మట్టిని సంచుల్లో నింపే ప్రక్రియ కూడా పూర్తి చేశారు. హరితహారంలో భాగంగా వేప, మర్రి, దానిమ్మ, చింత వృక్షాలతో పాటు, గులాబీ, మల్లె, మందార, చామంతి, వంటి పూల మొక్కలు, జామ, సీతాఫలం అల్లనేరేడు వంటి పండ్ల మొక్కలను అందించేలా ప్రణా ళిక సిద్ధం చేశారు. త్వరలోనే విత్తనాలను నాటేలా కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో నిర్వహించే నర్సరీలకు ఉపాధి హామీ పథకం కింద నిధులు చెల్లించనున్నారు.

అయితే గత ఏడాదికి సంబంధించి మట్టి, విత్తనాలకు సంబంధించిన డబ్బులు రాలేదని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. సకాలంలో బిల్లులు కాకపోవడంతో నర్సరీల నిర్వహణ ఇబ్బందిగా మారుతుందని వాపోతున్నారు. ఆ నిధులు త్వరలో విడుదల చేస్తే కూలీలకు ప్రయోజనంతో పాటు, నర్సరీల నిర్వహణ సులభంగా మారుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

### నర్సరీలు సిద్ధమవుతున్నాయి



ఏటా వర్షాకాలంలో చేపట్టే హరితహారంలో భాగంగా ఈ ఏడాది 13 లక్షల 21వెయ్యి మొక్కలు నాటే విధంగా కార్యాచరణ సిద్ధం చేశాం. ఈ మేరకు మొక్కలు సరఫరా చేసేందుకు వీలుగా అన్ని గ్రామాల్లో నర్సరీలను ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేశాము. ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. లక్ష్యానికనుగుణంగా మొక్కలను సరఫరా చేసేందుకు వీలుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

- ఉమాదేవి, డీఆర్‌డీవో

## నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 19 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని గట్టుకాడిపల్లి అంజనగిరి క్షేత్రంలో స్వయంభువుగా వెలసిన శ్రీలక్ష్మి అలర్మేల్ మంగా సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం స్వామివారికి క్షీరాభిషేకంతో ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ సంవత్సరం భక్తులు సేద తీరేందుకోసం కల్యాణ మండపం సైతం నిర్మించారు. కాగా, ప్రతీనెల ఏడో తేదీన తిరుమల శ్రీవారి దర్శనం మాదిరిగా అంజనగిరి క్షేత్రాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా మారింది.

### ఉత్సవ కార్యక్రమాలు

ఈనెల 20న మంగళవారం స్వామివారికి క్షీరాభిషేకం, యాగశాల ప్రవేశం, అంకురార్పణతో స్వామివారి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 21న ధ్వజారోహణం, 22న తేరు కల్యాణం, 25న స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించి తదితర కార్యక్రమాలతో పాటు, విశేష పూజలు నిర్వహిస్తారు.

### వెంకటగిరిలోనూ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

కొత్తకోట : మండల కేంద్ర సమీపంలోని వెంకటగిరి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కొత్తకోట, కానాయపల్లి, నిర్వేన్, పాలెం గ్రామాల సరిహద్దుల్లో 400 ఏండ్ల క్రితం సంస్థానదీశులు నిర్మించిన వెంకటగిరి వేంకటేశ్వరస్వామి క్షేత్రం ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి గాంచింది. కొలిచే భక్తులకు కొంగు బంగారంగా స్వామివారు విరాజిల్లుతున్నారు. సుగూరు సంస్థాన రాజుల కాలంలో ఆలయ నిర్మాణం జరుగగా, వనపర్తి సంస్థాన దీశుల కాలంలో ప్రసిద్ధికెక్కింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజరోహణ, గురువారం వేంకటేశ్వరస్వామి కల్యాణం, శుక్రవారం పల్లకీసేవ, శనివారం రథోత్సవం నిర్వహించనున్నారు.

## రాష్ట్రాన్ని దోచుకున్నారు

- ఎన్నికల సన్నాహక సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు



గద్వాలలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

గద్వాల/అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 19: రాష్ట్రాన్ని పదేళ్ల పాలించిన కేసీఆర్, మంత్రులు, ఎమ్మెల్యేలు దోచుకున్నారని, మిగులు బడ్జెట్‌లో ఉన్న రాష్ట్రాన్ని ఏడు లక్షల కోట్ల అప్పులపాలు చేశారని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. సోమవారం ఆయన అలంపూర్ ఆలయాలను దర్శించుకున్నారు. అనంతరం అలంపూర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎంపీ ఎన్నికల సన్నాహక సభలో ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, కూచకుళ్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ కుచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి మల్లు రవి, జడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, మాజీ మంత్రి చిన్నారెడ్డిలతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ ఇక్కడి మంత్రి ఇదే మండలంలోని కృష్ణానది తీర గ్రామలైన మారమునగాల, చందూరు గ్రామ శివార్లలో అక్రమంగా భుములు సంపాదించారన్నారు. కృష్ణా నదిని కూడా కబ్జా చేశారని ఆరోపించారు. వీరి అవినీతిని సహించలేకే ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారని అన్నారు. అయిన సిగ్గులేకుండా రెండు నెలల పసికందు అయిన కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాలు సాధిస్తామని, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఎవరైన భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు.

### దుష్ప్రచారం వల్లే ఓడిపోయాను: సంపత్

అలంపూర్ నియోజకవర్గంలో చివరి పది రోజుల వరకు అన్ని సర్వేలు తనకే అనుకులంగా ఉన్నాయని, కానీ కింది స్థాయిలో కులం, మతం పేరుతో అందరూ ఒక్కటై ఓడించారని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆరోపించారు. నేడు గెలిపించినవారు, గెలిచినవారు ఎవరూ ప్రజల్లో లేరని, కానీ తాను మాత్రం ప్రజల్లోనే ఉన్నానని అన్నారు. తాను కూడా పొరపాట్లు చేసి ఉంటానని, క్షమించి వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మంత్రి అవుతాడనే సంపత్‌ను ఓడించారని, కానీ నాయకుడిగా ఈ సభతో గెలిచారని మల్లురవి అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీసమ్మ, జడ్పీటీసీ సభ్యులు సుగుణమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

### సోనియా కుటుంబానికి అండగా ఉండాలి

'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సమయంలో పిల్లలు పిట్టల్లా రాలిపోయింద్రు. తల్లుల కడుపుకోత తెలిసిన సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు. ఆ కుటుంబమే దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసింది. అలాంటి కుటుంబానికి అండగా ఉండి, ఎంపీ సీట్లను అందిద్దాం' అని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం గద్వాలలో నిర్వహించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ సరిత అధ్యక్షత వహించారు. మంత్రి జూపల్లి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్‌కు బంగారు పళ్లెంలో రాష్ట్రం అప్పగించామని అన్నారని, కానీ రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేతికిచ్చారని చెప్పారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భూ స్థాపితం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి పరిపాలనలో రెండు నెలల్లోనే పాలన గాడిన పడి, ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టారని వివరించారు. రుణమాఫీకి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 50 వేల మెజారిటీతో అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తూడి మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, మాజీ ఎంపీ మందా జగన్నాథ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, నాయకులు రాజీవ్‌రెడ్డి, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జయశంకర్ వర్సిటీ వీసీ పదవికి గట్టి పోటీ!

» 28 మంది దరఖాస్తు.. వడపోత తర్వాత ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ పదవికి గట్టి పోటీ నెలకొంది. ఏకంగా 28 మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. వీసీ పోస్టు కోసం ఈ నెల రెండో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులకు సోమవారంతో గడువు ముగిసింది. 28 మంది దరఖాస్తు చేసినా.. ప్రధాన పోటీ నలుగురైదుగురి మధ్యే ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్సిటీలో పరిశోధన విభాగం డైరెక్టర్(డీఆర్)గా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన ఆర్. జగదీశ్వర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జగదీశ్వర్‌ది కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి మండలం. ఐదేళ్లు డీఆర్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో వీసీ రేసులో ముందు వరుసలో ఉన్నారు. సీనియర్ ప్రొఫెసర్ ఎం.గోవర్ధన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు నేతృత్వంలోని స్క్రీనింగ్ కమిటీ దరఖాస్తులను పరిశీలించి.. ముగ్గురి పేర్లతో షార్ట్‌లిస్టు తయారుచేసి సీఎంకు పంపించనుంది. చివరిగా వీసీ నియామకాన్ని గవర్నర్ ఫైనల్ చేస్తారు. మొత్తం మీద వర్సిటీ వీసీ నియామకం పారదర్శకంగా నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# ట్రైకార్ సబ్సిడీ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)

సుమారు రూ.130 కోట్ల నిధులు కేటాయించగా.. అందులో రూ.40 కోట్లకు పైగా సబ్సిడీ నిధులు స్వాహా అయినట్టు సమాచారం. ఈ పథకం కింద.. గిరిజన సహకార ఆర్థిక సంస్థ(ట్రైకార్) ద్వారా ఒక్కొక్క యూనిట్‌కు రూ.10 లక్షల నుంచి రూ.40లక్షల దాకా ఇస్తారు. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మొత్తంలో 10 శాతాన్ని.. లబ్ధిదారులు తమ వాటా ధనంగా తొలుత ఏదైనా జాతీయ బ్యాంకులో జమచేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం 60 శాతం సబ్సిడీ ఇస్తుంది. మిగిలిన 30 శాతాన్ని బ్యాంకులు రుణం రూపంలో ఇస్తాయి. రుణానికి అర్హులైన వ్యక్తులు లేదా జేఎల్ గ్రూపులు సమీప జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి, తమ వాటా 10 శాతం అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండుమూడు దశల్లో బ్యాంకు.. సదరు యూనిట్‌కు సామగ్రి అందించే సంస్థల పేరు మీద మాత్రమే చెక్కులు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీ 60 శాతం. ఇదీ పథకం స్వరూపం. దీని కింద.. తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏ, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఐటీడీఏల ద్వారా 2020-22లో సుమారు రూ.130కోట్లకు పైగా రుణాలు మంజూరు కాగా.. రూ.62 కోట్ల సబ్సిడీ నిధులు విడుదల చేసినట్లు సమాచారం.

### పక్కదారి ఇలా..

నిబంధనల ప్రకారం.. బ్యాంకులు గిరిజన సంక్షేమ శాఖ నుంచి ఐటీడీఏ పీవోల ప్రత్యేక ఖాతాలకు సబ్సిడీ మొత్తాన్ని జమ చేస్తాయి. ఐటీడీఏ పీవోలు.. ఎంపికైన లబ్ధిదారుల ఖాతాకు సబ్సిడీని జమ చేయాలి. కానీ, బ్యాంకు ఇచ్చే 30శాతం రుణంతో సంబంధం లేకుండా కేవలం సబ్సిడీ డబ్బులతో యూనిట్లకు కావాల్సిన సామగ్రిని లబ్ధిదారులకు ఐటీడీఏ అధికారులే అంటగడుతున్నారు. చాలా చోట్ల పాత సామగ్రిని ఇచ్చి, లబ్ధిదారులతో సంతకాలు చేయించుకుని వెళ్తున్నారు. సరైన సామగ్రి లేక తర్వాత ఆ యూనిట్లు మూలనపడుతున్నాయి. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని కొత్తగూడలో శ్రీముసలమ్మ ట్రైబల్ జేఎల్ గ్రూపునకు దాల్ మిల్ యూనిట్ కోసం రూ.40లక్షలు మంజూరయ్యాయి. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఖాతా తెరిచి తమ వాటాధనం 10 శాతం (రూ.4 లక్షలు) జమ చేశారు. నిబంధనల ప్రకారం దాల్ మిల్ యంత్రాల కొనుగోలు డబ్బులను బ్యాంకు ద్వారా చెల్లించాలి. కానీ, ఆ యంత్రాలను ఓ మధ్యవర్తి ద్వారా ఐటీడీఏ అధికారులే కొనుగోలు చేసి తూతూమంత్రంగా మిల్లును ఏర్పాటు చేశారు. సుమారు రూ.8 లక్షల వరకూ ఖర్చు చేసినట్టు లెక్కలు చూపారు. ట్రయల్ రన్ పేరుతో ఆ యూనిట్‌ను మూడు రోజులు నడిపించిన సభ్యులు..




ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశాల జేఎల్ గ్రూపు చెక్‌పై ఏటూరునాగారం ఐటీడీఏ పీవో సంతకం

ముడి సరుకులు లేకపోవటంతో పాటు ఇంకా రావాల్సిన ఇతర యంత్రాలు లేక మిల్లును మూసేశారు. నాలుగేళ్లుగా ఆ దాల్ మిల్ నడవటం లేదు. మిగతా సబ్సిడీ సొమ్ము ఏమైందో ఎవరికీ తెలియదు. కాగా, గ్రూపు వాటాధనంగా బ్యాంకులో ఉన్న రూ.4 లక్షల్లో రూ.2.50 లక్షలు యూనిట్ కోసం ఇచ్చిన బంగ్లా మరమ్మతుల కోసమని కాంట్రాక్టర్ రంజిత్‌కు ఐటీడీఏ ఏపీవో ఆదేశాలతో ఇచ్చినట్లు గ్రూపు సభ్యులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. ఇప్పటి వరకు ఆ డబ్బులు తిరిగివ్వలేదు. అలాగే.. భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని పాల్వంచ మండలం ముల్కలపల్లి గ్రామానికి చెందిన గిరిజనులకు శ్రీరాయకపోడు ట్రైబల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఎంఎస్ఎంఈ గ్రూపునకు కళాకృతుల తయారీ కోసం రూ.32.15 లక్షల రుణం మంజూరైంది. ఈ గ్రూపునకు సంబంధించిన 10శాతం వాటా ధనాన్ని (రూ.3.22 లక్షలు) బ్యాంకులో కాకుండా.. ఫోన్‌పే ద్వారా ఒక అధికారి తన వ్యక్తిగత ఖాతాలో జమ చేయించుకున్నారు. భద్రాచలంలోని పాత ఎన్ఆర్‌సీ భవనంలో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం ఐటీడీఏ అధికారులు ఈ యూనిట్ ఖాతాలో రెండు విడతల్లో రూ.5.50లక్షలు జమ చేశారు. అందులో నుంచి భవన మరమ్మతులు, సున్నం కోసమని రూ.4.50లక్షలు వాడేసుకున్నారు. ఆ కాంట్రాక్టును కూడా.. సదరు అధికారి తన దగ్గరి బంధువుకే సమర్పించేసుకున్నారు. రూ.1.50లక్షలతో కొంత సామగ్రి తీసుకొచ్చి ఆ భవనంలో ఉంచారు. ఈ యూనిట్‌కు రావాల్సిన సబ్సిడీ రూ.19.29 లక్షలు. అయితే కేవలం రూ.6 లక్షలే లెక్క చూపిస్తున్నారు. మిగతా రూ.13.29లక్షల సబ్సిడీ ఎవరి ఖాతాలోకి వెళ్లిందనేది చర్చనీయాంశంగా మారింది. బ్యాంకుతో సంబంధం లేకుండా సబ్సిడీ నిధులను వాడటం నిబంధనలకు విరుద్ధం. శాఖ అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం వెలుగులోకి వచ్చినా పై అధికారుల దృష్టికి వెళ్లకుండా ఐటీడీఏ స్థాయిలోనే 'మేనేజ్' చేశారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో ఎస్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. ప్రస్తుతం ఆ కళాకృతుల తయారీ కేంద్రం కళతప్పింది.

### మూడో ఉదాహరణ..

మహబూబాబాద్ జిల్లా గార్లలో శ్రీసారలమ్మ జేఎల్ గ్రూపునకు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రానికి రూ.25లక్షల రుణం మంజూరైంది. గార్లలోని ఎస్‌బీఐలో ఖాతా తెరిచి తమ వాటాధనం రూ.2.50 లక్షలు జమచేశారు. ఇక్కడ బ్యాంకు లోన్ రూ.7.50 లక్షలతో సంబంధం లేకుండానే డీఆర్‌డీఏలో పని చేసే ఓ అధికారి ఐటీడీఏ అధికారులతో కలిసి యూనిట్ ప్రారంభిస్తున్నామని చెప్పి, రూ.5లక్షల సబ్సిడీని బ్యాంకు ఖాతాలో జమ చేయించారు. ఇందులో నుంచి రూ.3లక్షలు పి.శ్రీనివాస్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ అయ్యాయి. మిగతా రూ.2లక్షలు జేఎల్ గ్రూపు డ్రా చేసుకున్నట్టుగా బ్యాంకు రికార్డులున్నాయి. ఈ పథకం కింద ఖాతా తెరిచిన తరువాత యూనిట్‌కు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసిన కంపెనీకే పేమెంట్లు చేయాలి. వ్యక్తిగతంగా వాడుకోవడానికి వీలులేదు. అయితే పి.శ్రీనివాస్ ఎవరు.. ఆయనకు ఎందుకు జమ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసమని రూ.3.80లక్షలు ఎన్‌పీడీసీఎల్‌కు డీడీ రూపంలో చెల్లించారు.

### రూ.2.50లక్షలు తీసుకున్నరు



మేం పెట్టిన దాల్ మిల్ నాలుగేళ్లుగా మూత పడింది. బ్యాంకు నుంచి లోన్ ఇవ్వలేదు. సబ్సిడీ కూడా రాలేదు. మిషన్లు ఐటీడీఏ వాళ్లే ఇచ్చిండ్లు. మూడు రోజులు ట్రయల్ నడిపినం. ముడిసరుకు లేకపోవటంతో బంద్ జేసినం. మా వాటా కింద బ్యాంకుల జమ చేసిన రూ.5 లక్షల నుంచి కాంట్రాక్టర్ రంజిత్‌కు రూ.2.50 లక్షలు ఇచ్చినం. ఐటీడీఏ ఏపీవోతోపాటు మరో ఇద్దరు అధికారులు కాంట్రాక్టర్‌కు ఆ పైసలు ఇవ్వాలని చెప్పారు. మిల్ నడిపే రూమ్‌ను ఏదో రిపేర్ చేస్తామని తీసుకున్నారు. మళ్లీ ఇస్తామని చెప్పి నాలుగేళ్లవుతున్నా మా డబ్బులు ఇవ్వలేదు. సబ్సిడీ రావటం లేదు. దాల్ మిల్ నడవటం లేదు. మేం అన్ని రకాలుగా నష్టపోయాం.

\- భూపతి శ్యామల,
కొత్తగూడ, జేఎల్ గ్రూపు అధ్యక్షురాలు

బ్రిక్స్ యూనిట్ కోసం ప్రత్యేకంగా ఇంత పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఎందుకనేది సమాధానం లేని ప్రశ్న. బయ్యారంలో కూడా సిమెంట్ ఇటుకల యూనిట్‌లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో అశ్వారావుపేట, దమ్మపేటలో కొండరెడ్లకు మంజూరైన యూనిట్లు, భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లోని కోయలకు మంజూరైన యూనిట్లలో సబ్సిడీ వారికి తెలియకుండా గిరిజన సంక్షేమశాఖ అధికారులు స్వాహా చేసినట్టు సమాచారం. ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొడిశల, లింగాల, ములుగు మండలం జంగాలపల్లి, కొత్తగూడ మండలం దొరవారి వేంపల్లి, పొగులపల్లి గ్రామాల్లోని జేఎల్ గ్రూపులకు మంజూరైన నిధులూ దారి తప్పినట్టు తెలుస్తోంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా మూడేళ్లలో రూ.40కోట్లకు పైగా సబ్సిడీ నిధులు ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ అధికారులు పక్కదారి పట్టించారని సమాచారం.

### పీవోలకు చెక్ పవర్!

ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసుకునే లబ్ధిదారుల గ్రూపులో అధ్యక్ష, కార్యదర్శులకు చెక్‌పవర్ ఉంటుంది. ఆ ఇద్దరి పేరిటే బ్యాంకులో ఖాతా తెరుస్తారు. అయితే ఈ పథకంలో మాత్రం ఐటీడీఏ పీవోలు కూడా తమ పవర్ చూపిస్తున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ పీవో.. లబ్ధిదారులతో పాటు తనకు కూడా చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు రాయడమే కాకుండా, చెక్కులపై సంతకాలు చేసేస్తున్నారు. దీంతో ఇతర ఐటీడీఏ పీవోలకు కూడా ఆశ పుట్టి జేఎల్ గ్రూపుల్లో తమకు కూడా జాయింట్ చెక్ పవర్ ఇవ్వాలని బ్యాంకులకు లేఖలు వ్రాసి సాధించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### చక్రం తిప్పింది ఆయనే!

గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలోని ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగే ఈ మొత్తం దందాలో కీలక పాత్ర పోషించారని సమాచారం. ఆ 'లక్ష్మీ'పుత్రుడు తనకు తానే రాష్ట్రంలో ఈ మిషన్ మేనేజర్‌గా చెప్పుకొంటూ సబ్సిడీ నిధులను అవినీతి అధికారులకు 'ప్రసాదం'లా పంచారనే చర్చ గిరిజన శాఖలో జరుగుతోంది. శాఖలోని ప్రధాన అధికారుల నుంచి ఐటీడీఏలోని కింది స్థాయి అధికారి వరకూ అందరినీ ఆయన వాటాలతో మేనేజ్ చేస్తున్నట్టు సమాచారం. గత ప్రభుత్వ హయంలో గిరిజనశాఖ మంత్రి సమీప బంధువు కూడా ఒకరు ఈ సబ్సిడీ స్వాహాపర్వంలో కీలకంగా ఉన్నట్లుగా సమాచారం. ఈ అక్రమార్కుల భరతం పట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ జరిపించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

### హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ
# హరికృష్ణ సస్పెన్షన్ ఉత్తర్వులు కొట్టివేత

» సస్పెన్షన్‌పై హైకోర్టుకు వెళ్లిన మాజీ ఓఎస్డీ

» కాంపిటెంట్ అథారిటీ జారీ చేయలేదంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల కొట్టివేత

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సస్పెన్షన్‌కు గురైన హకీంపేట స్పోర్ట్స్ పాఠశాల మాజీ ఓఎస్డీ టి.హరికృష్ణకు హైకోర్టులో ఊరట లభించింది. కాంపిటెంట్ అథారిటీ మాత్రమే జారీ చేయాలంటూ ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టివేసింది. హరికృష్ణపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయనను విధుల్లోంచి తొలగిస్తూ అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వీసీ అండ్ ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలాంటి ఫిర్యాదు, విచారణ లేకుండా సస్పెండ్ చేయడం చెల్లదని, ఆధారాలు లేకపోయినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలోని యువజన వ్యవహారాలు, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారని, ఈ ఉత్తర్వులు చెల్లవని హరికృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ పశు సంవర్ధక శాఖలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా నియమితులయ్యారని, 2020లో హకీంపేట స్పోర్ట్స్ పాఠశాలకు ఓఎస్డీగా డిప్యూటేషన్‌పై వెళ్లారని ఆయన తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు, కారణాలు లేకుండా, అధికార పరిధికి విరుద్ధంగా కేవలం ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పిటిషనర్ డిప్యూటేషన్‌పై క్రీడా శాఖకు వెళ్లారని, సరైన కారణాలు, విషయ తీవ్రత ఉన్నా కాంపిటెంట్ అథారిటీ మాత్రమే సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయగలరని వ్యాఖ్యానించింది. ఈ కేసులో పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శి అపాయింటింగ్ అథారిటీ అని.. ఇప్పటి వరకు ఎలాంటి చార్జి మెమో జారీ చేయలేదని గుర్తు చేసింది. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా ఉన్నందున సదరు సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టి వేస్తున్నట్లు తుది తీర్పు జారీ చేసింది.

## కుట్ర చేసి, ఇరికించి సస్పెండ్ చేశారు

» కవిత, శ్రీనివాస్ గౌడ్ స్వార్థానికి నన్ను బలి చేశారు

» మాజీ సీఎం పేషీలోని భూపాల్‌రెడ్డికి మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదని నాపై కుట్ర

» హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ మాజీ ఓఎస్డీ హరికృష్ణ ప్రకటన

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలోని పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదన్న కారణంగానే తనను కుట్రపూరితంగా ఇరికించి.. సస్పెండ్ చేశారని హకీంపేట క్రీడా పాఠశాల మాజీ ఓఎస్డీ హరికృష్ణ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను తెలుసుకోకుండా అహంకారంతో ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారని, పైవారి మన్ననల కోసం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తనను బలి చేశారని ఆరోపించారు. గత ఏడాది హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన ఒక ఘటనకు సంబంధించి తనపై నమోదైన కేసు విషయంలో ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందని పేర్కొంటూ సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీట్ల కేటాయింపు విషయంలో గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా ఉన్న ఆంజనేయగౌడ్, ఆయన పీఏ (రిటైర్డ్) నర్సయ్య, శాట్స్ మాజీ ఛైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి తనను ఒత్తిడికి గురి చేశారని, అప్పటి సీఎం కేసీఆర్ పేషీలోని భూపాల్‌రెడ్డికి రోజూ మసాజ్ చేసే వ్యక్తి కుమారుడికి సీటు ఇవ్వలేదన్న కారణంగా అందరూ కలిసి తనను బలి పశువును చేశారని తెలిపారు. తనను సస్పెండ్ చేసిన రోజే ఆ స్థానంలో వెలమ సామాజిక వర్గానికి చెందిన ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించారని, నిజానికి అది రాష్ట్రస్థాయి పోస్టు అని, దానిలో కాంట్రాక్ట్ ఉద్యోగిని నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయని వివరించారు. అయినా వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు. విచారణ సమయంలో అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ, శాట్స్ మేనేజర్‌లకు అడ్మినిస్ట్రేటివ్ స్వేచ్ఛను ఇచ్చి ఉంటే వారు సమగ్రమైన విచారణ జరిపే వారని, తద్వారా తనకు న్యాయం జరిగేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పైవాళ్లు ఏదీ చెబితే దానినే వేదం అన్నట్టుగా వ్యవహరించేవారని ఆరోపించారు. తనపై ఆరోపణ వచ్చిన రోజు ఉదయం 9 గంటలకే ప్రెస్‌మీట్ పెట్టి మరీ తనను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎవరిపైన అయినా ఫిర్యాదు కానీ అనుమానం కానీ వస్తే ముందు చర్యలు తీసుకుని, ఆ తరువాత విచారణ చేస్తామని గత ప్రభుత్వం చెప్పిందని, అదే సరైన విధానమైతే.. ఇప్పుడు ఎవరైనా తప్పులు చేసినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే ముందుగా చర్యలు తీసుకుని, ఆ తర్వాత విచారణ చేయించాలని సీఎం రేవంత్‌ను కోరారు. తన కుటుంబ గౌరవ మర్యాదలను నాశనం చేసిన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

### కాళేశ్వరం ఒప్పందాలు బయటపెట్టాలన్న
## పిటిషనర్‌కు హైకోర్టు అక్షింతలు

» చట్టం, ప్రజా ప్రయోజన వ్యాజ్యం రూల్స్ చదువుకొని రావాలని చురకలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఎన్ని ఒప్పందాలు జరిగాయో వాటన్నిటినీ బయటపెట్టడంతోపాటు పూర్తి వివరాలను కోర్టు ఎదుట ఉంచాలంటూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు మీకు పిల్ రూల్స్ తెలుసా!? అని మండిపడింది. గత ఏడాది నవంబర్ 16న సికింద్రాబాద్‌కు చెందిన మధుగంటి విశ్వనాథ్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది నందిత గుహ వాదనలు వినిపించడానికి సిద్ధమవగా ధర్మాసనం జోక్యం చేసుకుంది. "పిటిషనర్‌ను సీనియర్ న్యాయవాది అని పేర్కొన్నారు. హైకోర్టు గుర్తించకుండా సీనియర్ న్యాయవాది అని ఎలా సంబోధిస్తారు? చట్టం, ప్రొసీజర్ తెలియకుండానే ఇక్కడికి వచ్చారా? ఇలాంటి పిటిషన్లు ఎందుకు వేస్తారో తెలుసు. ఆ తర్వాత ఎక్కడెక్కడ చర్చలు జరుపుతారో తెలుసు. హైకోర్టు లైబ్రరీలో కూర్చొని పిల్ రూల్స్, చట్టం చదువుకోండి. ఆ తర్వాత ఈ అంశాలపై పిల్ వేయవచ్చా? లేదా? అనేది మీకే అర్థమవుతుంది. పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ అంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు" అంటూ తలంటింది. పిటిషన్లో మార్పులు చేసి రావాలంటూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

### గ్రామసభ కోరం రూల్స్ సవరణపై పిటిషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామసభ నిర్వహణకు ఉండాల్సిన 'కోరం' నిబంధనలు సవరిస్తూ జారీ చేసిన జీవో 54 చెల్లదని పేర్కొంటూ ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. లంబాడా హక్కుల పోరాట సమితి నాయకుడు దేవానాయక్ దీనిని దాఖలు చేశారు. గ్రామసభ నిర్వహణకు మూడో వంతు హాజరైతేనే కోరం ఉన్నట్లని, అందులో సగం ఎస్టీలు ఉండాలనే నిబంధనలను సవరించారని, ఇది పెసా చట్టంతోపాటు గిరిజన ప్రాంతాల్లోని ప్రజల హక్కులకు విరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

### బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ..
## బీజేపీతో పొత్తు పెట్టుకోదు: బాల్క సుమన్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, తమ పార్టీ అధినేత కేసీఆర్ సెక్యులర్ నాయకుడని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తమ పార్టీ బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదని చెప్పారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని తాము ఎక్కడా చెప్పలేదని, ఎవరినీ అడగలేదన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఇతర నాయకులు బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదనడం తగదని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు మీడియాకు లీక్ లిస్తున్నారని, పత్రికల్లో రాయిస్తున్నారని అన్నారు. 15 రోజుల్లో నలుగురు గురుకుల విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్నారని, దీన్ని పట్టించుకోకుండా రాష్ట్రంలో సమస్యలే లేనట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారని, కాంగ్రెస్ హైకమాండ్‌కు డబ్బు సంచులు మోస్తున్నారని ఆరోపించారు.

### వైటీపీపీ వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నేడు

నల్లగొండ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో తెలంగాణ సర్కారు నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీపీ) వద్ద మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ఇందులో ప్రజల నుంచి సానుకూలత వస్తేనే ప్లాంట్‌కు కేంద్ర పర్యావరణ శాఖ అన్ని అనుమతులు జారీ చేస్తుందని, అప్పుడే ప్లాంట్ నుంచి అధికారికంగా విద్యుదుత్పత్తికి మార్గం సుగమమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్లాంట్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఇళ్లు కోల్పోయిన గిరిజనులకు వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొంతమందికి పరిహారాలు అందలేదని, వాటన్నింటినిపై తేల్చాలని నిలదీసేందుకు భూ నిర్వాసితులు సిద్ధమవుతున్నారు.

### 825 శాతం పెరిగిన ఆక్సిజన్ బెడ్స్

» దేశవ్యాప్తంగా సర్కారు ఆస్పత్రుల్లో ప్రస్తుతం 5.15 లక్షల బెడ్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో గడిచిన నాలుగేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్ల సంఖ్య 825 శాతం పెరిగినట్లు కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 5,15,345 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ పడకల వివరాలను కేంద్రం తాజాగా విడుదల చేసింది. ఈ పడకలన్నీ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి అందుబాటులో ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నాటికి మన దేశంలో కేవలం 62,458 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రస్తుతం దేశంలో అత్యధికంగా 1,32,314 ఆక్సిజన్ బెడ్స్ మహారాష్ట్రలో ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఆ రాష్ట్రంలో 11,254 ఆక్సిజన్ బెడ్స్ ఉండేవి. 61,074 ఆక్సిజన్ బెడ్స్‌తో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్(42,221), గుజరాత్(40,708), పశ్చిమబెంగాల్(28,267), కర్ణాటక(27,707) రాజస్థాన్(20,116) నిలిచాయి. తెలంగాణలో 2020ఏప్రిల్ నాటికి సర్కారీ దవాఖానాల్లో 181 ఆక్సిజన్ పడకలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 13,664కు పెరిగినట్లు కేంద్రం పేర్కొంది. కాగా, దేశవ్యాప్తంగా ఉన్న ఆక్సిజన్ పడకల్లో 25.86 శాతం దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నాయి. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ రాష్ట్రాల్లో 1,33,289 ఆక్సిజన్ బెడ్స్ ఉన్నట్లు కేంద్రం పేర్కొంది.

### టీఎస్ పీఈసెట్ షెడ్యూల్ విడుదల

టీఎస్-పీఈసెట్- 2024 షెడ్యూల్‌ను శాత వాహన విశ్వవిద్యాలయం కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ సోమవారం విడుదల చేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు గాను మార్చి 14 నుంచి మే 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆలస్యరుసుంతో మే 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. జూన్ 10 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

### ఖమ్మంలో చట్టవిరుద్ధంగా పోలీసుల ప్రవర్తన

» సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ఖమ్మం, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పోలీసులు గ్రామాల్లో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రజలను భయోత్పాతానికి గురి చేస్తున్నారని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య ఆరోపించారు. తమ పార్టీ కార్యదర్శి అశోక్, కమిటీ సభ్యుడు గోపన్న, సభ్యులు ఎస్‌కే మదార్, కే సురేష్‌ను ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకున్న పోలీసులు అక్రమంగా నిర్బంధించి ఫిబ్రవరి 16న మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని, వీరితోపాటు మరో 24 మందిపై సెక్షన్124-బి కింద కుట్ర కేసులు పెట్టారని విమర్శించారు. సీఎం జోక్యం చేసుకుని పోలీసు శాఖపై సమీక్ష చేయాలని కోరారు.

## మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్తా

» ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



బడ్జెట్ సమావేశాలకు రావాలని ఎమ్మెల్యే శ్రీహరికి ఆహ్వానం అందిస్తున్న చైర్‌పర్సన్

అమరచింత, ఫిబ్రవరి 19 : అమరచింత నూతన మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రజాభవన్‌లో అమరచింత మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ నూరుల్‌నజీబ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమరచింత మునిసిపాలిటీలో నెలకొన్న పలు సమస్యలను చైర్‌పర్సన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఆయన మునిసిపాలిటీ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తానని పేర్కొన్నారు. మంగళవారం అమరచింత మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని చైర్‌పర్సన్, కమిషనర్‌లు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. వీరితో పాటు ఎమ్మెల్యేను కలిసిన వారిలో మునిసిపల్ అకౌంటెంట్ ఇందిర, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగభూషణం తదితరులున్నారు.

## ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 19 : ఒకటి ఏప్రిల్ 2024 నాటికి 18 సంవత్సరాల వయసు పూర్తి కానున్న యువత ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర ఎన్నికల ప్రధాన ఎలక్టోరల్ అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటరు జాబితా ప్రచురించి అన్ని పోలింగ్ స్టేషన్లు, రాజకీయ పార్టీలకు పంపించామన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకున్న వారికి ఎపిక్ కార్డుల ముద్రణకు పంపడం జరిగిందని, పోస్టు ద్వారా వారి ఇంటికి చేరుతాయని తెలిపారు. ఒకవేళ ఎవరిదైనా ఎపిక్ కార్డు పోగొట్టుకొని ఉంటే వారు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వనపర్తి జిల్లాలో తుది ఓటరు జాబితా విడుదల చేసిన తరువాత ఇప్పటి వరకు 4,431 దరఖాస్తులు వచ్చాయని ఇందులో ఫారం-6, 7, 8 ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేష్, ఆర్డీవో పద్మావతి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

» జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి పద్మావతి

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఫిబ్రవరి 19 : సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి అర్హులైన మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ విద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ, డాక్టరేట్ వంటి ఉన్నత చదువులు కొనసాగించేందుకు విద్యార్థులు ఈనెల 20 నుంచి మార్చి 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల వార్షిక కుటుంబ ఆదాయం రూ.20 లక్షలలోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ.20 లక్షల ఉపకార వేతనంతో పాటు, విమాన ప్రయాణ ఖర్చులు రూ.60వేలు అందిస్తారన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తెలంగాణఈపాస్.సీజీజీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని హార్డ్ కాపీలను తమ కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

## 'వనపర్తి ఒడిలో' పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 19 : పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 25న వనపర్తిలో నిర్వహించే పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని పాలమూరు అధ్యయన వేదిక కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, నారాయణ సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. 1959 నుంచి 1973 మధ్యకాలంలో వనపర్తి పట్టణంలో నివాసం ఉండి తన బాల్యాన్ని గడిపిన రాఘవశర్మ యాభై ఏళ్ల తరువాత జ్ఞాపకాలను పుస్తకరూపంలో రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. ఈనెల 25న జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో సాయంత్రం మూడు గంటలకు నిర్వహించే ఈ సభకు పాలమూరు అధ్యయన వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్ హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. సాహితీమిత్రులు, రాజకీయ నాయకులు కార్యక్రమానికి హాజరు కావాలని వారు కోరారు.

## విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

పాన్‌గల్, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని కేతేపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర బాల స్వస్థీయ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ హరీశ్ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, ఐరన్ ఫోలిక్ విటమిన్ సి మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరీశ్ మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారం విధిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం ఉమ, స్వప్న, హెల్త్ అసిస్టెంట్ రాంచందర్, ఏఎన్‌ఎం శ్రీలక్ష్మి, ఆశ కార్యకర్తలు సంధ్య, ప్రమీల తదితరులున్నారు.

## మిట్ట భక్తాంజనేయస్వామి దేవస్థానానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న రియల్ ఎస్టేట్స్ వ్యాపారులు

పెబ్బేరు, ఫిబ్రవరి 19 : పెబ్బేరు పట్టణంలో స్వయంభువుగా వెలిసిన మిట్ట భక్తాంజనేయస్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు గాను పెబ్బేరు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్స్ వ్యాపారులు గౌని జశ్వంత్‌రెడ్డి, సదుర్ల వెంకటేశ్వర్లు, బి.లక్ష్మయ్యలు రూ.ఒక లక్షా 116 దేవస్థాన కమిటీకి విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న నవగ్రహ మండపం, దేవాలయ ప్రాంగణం, విస్తరణ, కామన్‌హాల్ నిర్మాణాలకు వినియోగించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గౌని బుచ్చిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కౌన్సిలర్ రామకృష్ణ, దాతలు సదుర్ల వెంకటేశ్వర్లు, బోయ లక్ష్మయ్య తదితరులున్నారు.

## ఉత్తమ సేవలు అందించారు : ఎంపీపీ

వీపనగండ్ల, ఫిబ్రవరి 19 : వీపనగండ్ల మండలానికి ఎంపీడీవో కథలప్ప ఉత్తమ సేవలందించారని ఎంపీపీ కమలేశ్వరరావు అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బదిలీపై వెళ్లిన ఎంపీడీవో కథలప్పకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు కథలప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్ తదితరులున్నారు.

● ఆత్మకూరు : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా వెంకటేశ్వర్లు మూడు సంవత్సరాలుగా నిస్వార్థ సేవలు అందించి సిద్దిపేట జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఎంపీడీవో సేవలను కొనియాడారు. చైర్‌పర్సన్ గాయత్రి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, రైతు సమన్వయ సమితి సభ్యుడు వీరేశలింగంతో పాటు, పలువురు ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు.

## చికిత్స పొందుతూ వివాహిత మృతి

గోపాల్‌పేట, ఫిబ్రవరి 19 : కుటుంబ కలహాల వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొంకల సింగోటం చిన్న కూతురు శకుంత (34)ను నంద్యాల జిల్లా పాణ్యం మండలం తిమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన ఉగ్రదండ రాయుడుకిచ్చి పదేళ్ల కింద వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు పిల్లలు. ఉగ్రదండరాయుడు నాలుగేళ్ల నుంచి గోపాల్‌పేటలో భార్యాపిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈనెల 13న రాత్రి భార్యాభర్తలు గొడవ పడ్డారు. అర్ధరాత్రి సమయంలో సూపర్ వాస్మోల్ ఆయిల్(తలకు పెట్టుకునే నూనె) తాగి తన భర్తకు చెప్పకుండా శకుంత పడుకుంది. కొద్దిసేపటి తరువాత ఛాతిలో ఆయాసం రావడంతో విషయాన్ని భర్తకు చెప్పింది. భర్త, స్థానికులు కలిసి వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మహబూబ్‌నగర్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలి

» కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

» ప్రజావాణికి 51 దరఖాస్తులు



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 19 : ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ఫిర్యాదుదారులు వస్తారని వారి నమ్మకాలను నిలబెట్టే విధంగా జిల్లా అధికారులు ఉండాలని కలెక్టర్ సూచించారు. సోమవారం ఐడీవోసీ ప్రజావాణి హాల్లో కలెక్టర్ పౌరుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. వచ్చిన ప్రజావాణి అర్జీలను సంబంధిత జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 51 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణికి హాజరు కాని జిల్లా అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 22వ తేదీన స్థానిక సురవరం ప్రతాపరెడ్డి టౌన్‌హాల్‌లో ప్రేరణ తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులందరూ ప్రేరణ తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, ఆర్డీవో పద్మావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ ప్రజావాణిలో కలెక్టర్‌ను కోరారు. 98, 69 జీవో ద్వారా శ్రీశైలం నిర్వాసితులకు ఉద్యోగాలతో పాటు, నష్టపరిహారం చెల్లించాలన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని, రూ.రెండు లక్షలు రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. గిరిజనులకు, దళితులకు, మైనార్టీలకు కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇవ్వాలని కోరారు. చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లో 12వేల ఎకరాల్లో వరి, ఉల్లి, మిర్చి పంటలు ఎండిపోయాయని రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వివరించారు. జూరాల చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చూడాలని పేర్కొన్నారు. జబ్బార్ వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి బాల్‌రెడ్డి ఉన్నారు.

### పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

మార్చి మూడో తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహణపై సోమవారం ప్రజావాణి హాల్లో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు ప్రతీ చిన్నారికి పల్స్ పోలియో చుక్కలు వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు, సంక్షేమ శాఖ, విద్యాశాఖ, మునిసిపాలిటీ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి వందశాతం వ్యాక్సినేషన్ జరిగే విధంగా చూడాలన్నారు. జిల్లాలో 54,030 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించామని, వీరందరికీ సరిపడా పోలియో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నట్లు డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్ తెలిపారు.

### పదవ తరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్, మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి హాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు లైన్ డిపార్ట్‌మెంట్‌లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో చిటీలు, మాల్ ప్రాక్టీస్ నడవడానికి వీలు లేదన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 6,576 మంది, రెండో సంవత్సరం పరీక్షలకు 5,881 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు 6,906 మంది రెగ్యులర్, 63 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. వేసవి కాలంలో పరీక్షలు జరుగుతున్నందున తాగునీరు, ప్రథమచికిత్సకు సరిపడా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

# వ్యవసాయ పక్షపాతి ఛత్రపతి శివాజీ మహారాజ్

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

» జిల్లాలో ఘనంగా శివాజీ జయంతి



పెబ్బేరులో జయంతి వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా/వనపర్తి టౌన్/పెబ్బేరు/ఆత్మకూరు/అమరచింత/రేవల్లి/ఖిల్లాఘనపురం/చిన్నంబావి, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ మహారాజ్ వ్యవసాయ పక్షపాతి అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మహిళల, రక్షణ గౌరవానికి కృషి చేసిన మహనీయుడు ఛత్రపతి అని కొనియాడారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ముందు హిందూవాహిని ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరై, శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచారని తెలిపారు. ఆయన చేసిన సాహసోపేతమైన నిర్ణయాలు సమాజానికి ఆదర్శంగా నిలిచాయని వివరించారు. అనంతరం జగదాంబ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, మునిసిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు నాగన్నయాదవ్, పాకనాటి కృష్ణ, నాయకులు చెన్నరాములు, ఉంగ్లం తిరుమల్, ఎల్‌ఐసీ కృష్ణ, పరంజ్యోతి, గులాం ఖాదర్‌ఖాన్, ప్రేమ్‌నాథ్ రెడ్డి, సూర్యవంశం గిరి, ఎర్ర శ్రీనివాసులు, జానంపేట శ్రీను, జగదాంబ యూత్ సభ్యులు వినోద్ గౌడ్, నందిమల్ల సుబ్బు, గణేష్‌గౌడ్, రాహుల్, పిట్టల వంశీకృష్ణ, శివగౌడ్, చీర్ల రాజేందర్, శివసాగర్ పాల్గొన్నారు.

అదేవిధంగా, జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని టీజేఏసీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనువాదాన్ని ధిక్కరించిన శివాజీ తన సామ్రాజ్యంలో సర్వమత సమానంతో అంటరాని కులాలకు ఆయుధాలిచ్చి సైనికులను చేసిన స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి వీర శివాజీ అని అన్నారు. కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు గిరిరాజాచారి, మండ్ల దేవన్ననాయుడు, కావలి బాలస్వామినాయుడు, గంధం నాగరాజు, పరమేశ్వరాచారి, బండలయ్య, బాలేమియా, పెద్దిరాజు, జనార్దన్‌గౌడ్ తదితరులున్నారు. పెబ్బేరులో యువకులు శివాజీ చిత్రపటాన్ని పట్టణంలో ఊరేగించారు. ఆజాద్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమంలో అన్ని యువజన సంఘాలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఆత్మకూరులో శివాజీనగర్ నుంచి శివాజీ శోభాయాత్ర నిర్వహించారు. హిందూ బంధువులతో పాటు, మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి హాజరై ఛత్రపతి శివాజీ శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం పట్టణ పురవీధుల గుండా యువకులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్వినికుమార్, నాయకులు బాలు, అశోక్, నరసింహ, బాలకృష్ణతో పాటు ఆయా కాలనీల యువకులు పాల్గొన్నారు. అమరచింతలో శివాజీ జయంతి కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పట్టణంలోని శివాజీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి కాషాయ జెండాను ఆవిష్కరించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ ప్రతిమను ఊరేగింపుగా తీసుకెళ్లి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శివాజీ జయంతి కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, గౌరవ అధ్యక్షుడు మాల రామ్మూర్తి, కౌన్సిలర్లు లక్ష్మి, పారుపల్లి ఉషారాణి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. రేవల్లి మండలం తలుపునూరు గ్రామంలో వీరశివాజీ యూత్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి, ఆటపాటలతో సంబురాలు చేశారు. ఖిల్లాఘణపురంలోని బస్టాండ్ ఆవరణలో సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. చిన్నంబావిలో శివాజీ చిత్రపటానికి ఎంపీపీ సోమేశ్వరమ్మ పూలమాల వేసి, ఆయన సేవలను కొనియాడారు. జడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

### వైభవంగా శోభాయాత్ర

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలో హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని రామాలయం వద్ద ప్రారంభమైన శోభాయాత్ర పాత బజారు కాళీమాత ఆలయం వరకు కొనసాగింది. రథంపై శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి పురవీధుల గుండా అంగరంగ వైభవంగా ఊరేగించారు. హిందూవాహిని సభ్యులు, యువకులు శోభాయాత్రలో నృత్యాలు చేస్తు ఆకట్టుకున్నారు.



వనపర్తిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి





గుర్రంబండిపై శివాజీ విగ్రహ ఊరేగింపు, డ్యాన్స్ చేస్తున్న యువకులు

## వేసవిలో మొక్కలను సంరక్షించాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 19 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలు వేసవిలో ఎండిపోకుండా చూడాలని గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ఎండకు మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు షిఫ్టింగ్ చేస్తూ కాపాడాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, వన సేవకులు ఉన్నారు.

## సమయపాలన పాటించాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 19 : ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన పాటించి క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బుసిరెడ్డిపల్లి, రాయినిపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. బుసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రార్థనా సమయానికి హాజరై, విద్యార్థుల చేత ప్రార్థన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని పాఠశాలకు వచ్చేలా చూడాలని సూచించారు. అనంతరం రాయినిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు దేవుజ, నాగరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

వీపనగండ్ల, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని కల్వరాలలో కొన్ని కాలనీల్లో మిషన్ భగీరథ పైపులైన్ లేకపోవడం వల్ల ప్రజలు తాగునీటి ఇబ్బందులకు గురవుతున్నారని కాంగ్రెస్ యూత్ నాయకుడు కల్వరాల నరసింహ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవన్నకు వివరించారు. నీటి సమస్య పరిష్కారం కోసం సోమవారం ఏఈ గ్రామంలోని వీధులను పరిశీలించారు. తాగునీటి పైపులైన్లు, నల్లాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేస్తానని ఏఈ కాంగ్రెస్ నాయకుడికి తెలిపారు. మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి తాగునీటి సమస్యను వివరించి, నిధులు మంజూరు కోసం విన్నవించనున్నట్లు నరసింహ పేర్కొన్నారు.

## నోటరీ పొడిగింపుపై హర్షం

ఆత్మకూరు, ఫిబ్రవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం నోటరీ పొడగింపుపై జీవో విడుదల చేసిన కారణంగా సీనియర్ న్యాయవాది, ఆత్మకూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తిప్పారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇదివరకు ఉన్న నోటరీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది 11వ నెల నుంచి మరో ఐదు సంవత్సరాల వరకు పొడగించినందుకు గాను ప్రభుత్వ కార్యదర్శికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆత్మకూరులోని సీనియర్ న్యాయవాది తిప్పారెడ్డి నోటరీ పొడిగింపును 1988 నుంచి ప్రతీసారి పొడిగించుకున్నందుకు గాను ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా పరమ శివుడి పల్లకీ సేవ

ఆత్మకూరు, ఫిబ్రవరి 19 : పరమశివుడి పల్లకీ సేవా కార్యక్రమాన్ని ఆత్మకూరులో శివస్వాములు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూర్తయిన సందర్భంగా పట్టణ పురవీధుల గుండా పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివస్వాములు పరమశివుడి సంకీర్తనలతో, భజన పారాయణంతో కోట్ల అంజనేయస్వామి ఆలయం వరకు పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు నరేందర్, బాలకృష్ణ, అంజి, యాదగిరి, శ్రీనివాస్, వెంకటేష్, శ్రీధర్‌తో పాటు, పలువురు శివస్వాములు పాల్గొన్నారు.

## రామ మందిరానికి బయలుదేరిన భక్తులు

గోపాల్‌పేట/పాన్‌గల్/వీపనగండ్ల, ఫిబ్రవరి 19 : అయోధ్యలోని రామమందిరం దర్శనానికి గోపాల్‌పేట, పాన్‌గల్, వీపనగండ్ల మండల కేంద్రాలతో పాటు, వివిధ గ్రామాల నుంచి శ్రీరామ భక్తులు బయలుదేరారు. గోపాల్‌పేట కోదండ రామస్వామి దేవాలయం, బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. చిక్కేపల్లిలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ముంత వెంకటేష్‌యాదవ్, వీపనగండ్లలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాకేష్ ఆధ్వర్యంలో నాయకులు, శ్రీరామ భక్తులు సోమవారం బయలుదేరి వెళ్లారు.

# ఆస్తి పన్ను వసూలు వందశాతం పూర్తి చేయాలి

» వనపర్తి మునిసిపల్ చైర్మన్ గట్టుయాదవ్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న గట్టుయాదవ్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 19 : పట్టణంలో బకాయి ఉన్న ఆస్తి పన్ను వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలని వనపర్తి మునిసిపల్ చైర్మన్ గట్టు యాదవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో గల తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపు దశ దగ్గర పడుతున్నా నేటికీ ఆస్తి పన్ను వసూలు 40 శాతం కూడా పూర్తి చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే బకాయిలను వేగవంతం చేయాలన్నారు. ఇళ్ల స్థలాల కొలతల ద్వారా నిర్వహించే భువన యాప్‌ను ఇంకా పూర్తి చేయకపోవడంపై అధికారులను నిలదీశారు. తక్షణమే భువన్ యాప్ వివరాలను సీడీఎంఏకు నివేదించి, పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తు చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, పెండెం నాగన్నయాదవ్, రెవెన్యూ విభాగం అధికారులు పాల్గొన్నారు. కాగా, రెవెన్యూ ఆఫీసర్ లేకుండానే చైర్మన్ సమావేశం నిర్వహించారు.

# ఉద్యోగులు సమాజ బాధ్యతగా పనిచేయాలి



ఉద్యోగాలు సాధించిన యువతను సన్మానిస్తున్న డాక్టర్ కృష్ణకుమార్‌రెడ్డి

కొత్తకోట, ఫిబ్రవరి 19 : ఉద్యోగం సాధించిన యువతీ, యువకులు ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని, జీవనం కోసం కాకుండా సమాజ బాధ్యతగా పని చేయాలని డాక్టర్ కృష్ణకుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఉద్యోగాలు సాధించిన పదిమంది యువతులను జేఏస్ రాములు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కృష్ణకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్‌ను ఎంచుకొని పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తారన్నారు. పట్టణానికి చెందిన పదిమంది ఒకే నోటిఫికేషన్‌లో ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం శాలువాతో సన్మానం చేసి, అంబేడ్కర్ చిత్రపటాలను బహుకరించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ప్రేమయ్య, మాజీ ఉప సర్పంచ్ బోయోజ్, కౌన్సిలర్లు భరత్‌భూషణ్, ఖాజామైనొద్దీన్, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు సతీష్‌రాజు, సభ్యులు భక్తరాజు, అమృతరాజు, దయానంద రాజు, నాయకులు గాడీల ప్రశాంత్, కిరణ్‌కుమార్, కర్ణకుమార్ తదితరులున్నారు.

# ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు ప్రశంసా పత్రాల పంపిణీ

కొత్తకోట, ఫిబ్రవరి 19 : పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ సమీపంలోని ఉద్యాన కళాశాల విద్యార్థులు మండలంలోని కనిమెట్ట గ్రామంలో వారంరోజుల పాటు ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. చివరిరోజైన సోమవారం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, వారంరోజుల పాటు విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలను ప్రజలు అభినందించారు. ఎంపీపీ గుంత మౌనిక ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల సేవలను కొనియాడి, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ప్రొఫెసర్ బేబీరాణి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య గ్రామ నాయకులు గుంత మల్లేష్, పరమేష్, మన్నెంకొండ, శివయాదవ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసిన ఎంపీపీ గుంత మౌనిక